# మారే లోకం

హైస్కూల్లో నేనూ రామ్మూర్తీ క్లాసుమేట్సుము; కొంత వరకు స్నేహితులం కూడా అనవచ్చు. హైస్కూలు చదువు తర్వాత అతను కాలేజీ చదువులకు పోవడమూ, నేను ట్రెయినింగు స్కూలుకు పోయి స్కూల్ మాస్టర్ను గావడమూ జరిగింది. ఆ తరువాత ఐదారేండ్ల వరకూ నేనూ అతనూ కలుసుకోవడం పడలేదు. మూడేండ్లనాడు కలుసుకున్నప్పుడు అతనే నన్ను గుర్తు పట్టి పలకరించినాడు — లేకపోతే నేను కనుక్కునే వాణ్ణి గాదేమో. ఆప్యాయంగా పలకరించి, నా యోగక్షేమాలు విచారించి, తన సంగతులన్నీ వివరంగా చెప్పినాడు. తాను బియ్యే పాసైన సంగతీ, పెండ్లైన సంగతీ, నానా అవస్థలూ పడి పోలీస్ సబిన్స్పెక్టర్ పని సంపాయించిన సంగతీ, తన కప్పుడే ఇద్దరు పిల్లలున్న సంగతీ అన్నీ చెప్పి, నాకెందరు పిల్లలున్నదీ అడిగినాడు. అరగంట అరమర లేకుండా యిద్దరమూ మాట్లాడుకున్న తరువాత — అంటే ఎక్కువ భాగం అతను మాట్లాడడమూ నేను వినడమూ అయిన తరువాత — అతనన్నాడు "నీనోరేమో పడిపోయి నట్లుందే ? ఎంతసేపూ నేను చెప్పేది వినడమేగాని, నీవు చెప్పేదేమీ లేదా ?" "నేనూ మాట్లాడుతున్నానుగా" అన్నాను సిగ్గు పడుతూ. "ఏం మాట్లాడుతున్నావ్ ? అడిగిన ప్రశ్నలకు ముక్తసరి జవాబులు చెబుతున్నావ్. చిన్నప్పుడు ఎంతగా వాగుతుండేవాడివో జ్ఞాపకముందా ? నీవున్న చోట పది మంది వున్నట్లుండేది" అన్నాడు రామ్మూర్తి. నాలుగేండ్లు బడిపంతులు ఉద్యోగం చేస్తే గుండెల్లో యెంత బరువు గూడు కట్టుకునేదీ చెప్దామనుకున్నాను; కానీ అభిమానం అడ్డం

వచ్చి మౌనంగా వుండి పోయినాను. "లేక పోలీసువాళ్ళ ముందు జాగ్రత్తగా మెలగాలనుకున్నావా?" అని బిగ్గరగా నవ్వుతూ అతను నా భుజం తట్టినాడు. అతని సరసానికి నాకూ నవ్వువచ్చింది. యిద్దరమూ నవ్వుకున్న తరువాత అతనే మళ్ళీ అన్నాడు: "చిన్నప్పటి సుఖం జీవితంలో తరువాత యెప్పుడూ వుండదు. మళ్ళీ చిన్నతనం వస్తే బాగుంటుంది కదూ?" ఏదో వొక మాటైనా అనకపోతే బాగుండదని "నీకేం, మంచి వుద్యోగమే వచ్చింది. ఏ దిగులూ లేకుండా హాయిగా వుండవచ్చు" అన్నాను. ఆ మాటలు వింటూనే అతని ముఖంలోని సంతోషమంతా మాయమైంది. విచారం నిండిన కంఠంతో "మంచి వుద్యోగమే — యీ వుద్యోగం యెన్నాళ్ళు చేస్తానో తెలియదు. ఎప్పుడో ఒకసారి రాజీనామా పెట్టేస్తాను" అన్నాడు. ఆదుర్దాగా నేనన్నాను: "ఎందుకు రామ్మూర్తీ? మళ్ళీ వుద్యోగం దొరికించుకోవడం అంత సులభం గాదు." అతనికి ఆవేశం వచ్చింది. కోపమూ, విషాదమూ నిండిన కంఠంతో అన్నాడు: "ఈ వుద్యోగం కంటె బిచ్చమెత్తుకోవడమే మేలు. నిజంగా మానం మర్యాదా వున్నవాడెవడూ యీ వుద్యోగం చేయలేడు." ఇంక నేనేమన్నా అతని ధోరణి ప్రమాదకరంగా మారుతుందేమోనని నాకు భయమైంది. ఐదు నిముషాలు యిద్దరమూ మౌనంగా వున్న తర్వాత రామ్మూర్తి అన్నాడు: "నీ వుద్యోగమే మేలేమో. నీ జీవితంలో సిగ్గు పడవలసిన పని యేమీ వుండదు." ఆ మాటలలో నాకేదో కొత్త వెలుగు కనబడినట్లయింది. ఆ దృష్టితో నా జీవితాన్నెప్పుడూ విమర్శించుకో లేదు. జీవితంలో సంపూర్ణంగా ఓడిపోయినట్లు యెప్పుడూ సిగ్గు పడుతూ వుండే వాణ్ణి. ఒక క్షణంపాటు కొత్త ఆత్మవిశ్వాసం—కొత్త గర్వం — కలిగింది నాకు. కానీ, మరుక్షణంలోనే అనుమానం వచ్చింది—యిది కొత్త రకం మత్తు మందేమోనని. ఎందుకంటే నా కంతకు ముందే తెలుసు—ఆత్మ

హత్య చేసుకునేవాళ్ళకు గూడా ఒక విధమైన గర్వముంటుందని.

ఇది జరిగి మూడేండ్లయింది. ఆనాడే అనుకున్నాను—రామ్మూర్తిలో చాలా మార్పు వచ్చిందని. ఇంత సుకుమార హృదయం అతనిలో వుందని నేనెప్పుడూ ఊహించలేదు. నాకూ అతనికీ చిన్నప్పుడు వున్న పరిచయమంతా జ్ఞాపకం చేసుకొని చూసుకున్నాను. పరీక్షలు పాసుకావడం తప్ప చెప్పుకోవలసిన సద్గుణాలు కానీ, శ్రద్ధగా చదువుకోవడం తప్ప అనుకోవలసిన దుర్గుణాలు కానీ అతనిలో యేమీ వుండేవి కావు. కొద్ది యేండ్లలోనే అతని హృదయం యింత సున్నితం కావడానికి ఆ మధ్య యేమో జరిగి వుంటుందని సరిపెట్టుకున్నాను.

వారం రోజులనాడు రామ్మూర్తి యీవూరికి బదిలీ ఐనాడనివిన్నాను. సబిన్స్పెక్టర్ నాకు స్నేహితుడంటే యీ చిన్న వూర్లో నా గౌరవం కొంత పెరుగుతుందని ఆశపడినానేమో నాకు తెలియకుండానే – అతను వచ్చిన రోజు సాయంత్రమే ఉత్సాహంతో బయలుదేరినాను పోలీస్టేషన్కు. చిరునవ్వుతో నేనే పలకరించినాను ముందు 'ఎప్పుడు వచ్చినావు రామ్మూర్తీ?' అని. "ఈ దినమే" అని "పని తొందర్లో వున్నాను, కాసేపు కూర్చో" అన్నాడు. "ఛార్జి తీసుకోవడం, పాత కేసులతో పరిచయం చేసుకోవడం" అంటూ అతని తరఫునా, నా తరఫునా సమాధానం చెప్పుకొని బయట వరండాలో కూర్చున్నాను. ఫైళ్లూ, రికార్డులూ చూడడం రైటర్తో మాట్లాడడం, జవాన్లను గద్దించడం – గంటసేపు కూర్చున్నా రామ్మూర్తి పని తెమల్లేదు. "పనిమీదున్నావ్. మళ్లీ రేపొస్తాలే" అని సెలవు తీసుకొని వచ్చేసినాను – అతను వచ్చిన రోజే నేను పోవడం పొరపాటే అనుకుంటూ.

మరుదినం ఉదయం అతనే పిలిపించినాడు నన్ను. నన్ను చూస్తూనే వరండాలోకి వచ్చి రెండు మాటల్లో కుశల ప్రశ్నలు ముగించి "చిన్నప్పటి

నుండీ స్నేహితులం, మీ వూర్లో నీవు నాకు సహాయం చేయాలి.... నీకూ అంతో యింతో ఆదాయం చూపిస్తాను" అన్నాడు నా ముఖంలోకి చూస్తూ. విషయమేమైందీ అర్థంకాక దిగ్భ్రమతో అతని వైపు చూసినాను. "వివరా లన్నీ తీరికగా మాట్లాడుకోవచ్చులే. ముందు అసలు సంగతి చెప్పు. నీ మీద నమ్మకం పెట్టుకొని వుంటాను. ఏమంటావ్ ?" అన్నాడు అతను ఒక్కొక్క మాటే నిదానంగా ఒత్తి పలుకుతూ. ఒక నిమిషం పట్టింది — నాకు దిగ్భ్రమ వదలి, నాకేదో పని పురమాయిస్తున్నాడని అర్థం చేసుకో డానికి. నీకూ అంతో యింతో ఆదాయం చూపిస్తానన్న మాట జ్ఞాపకం వచ్చి భయం కూడా కలిగింది నాకు కొంత, పని యేమైందీ అర్థం కాక పోయినా. "అటువంటి పనులు నాతో కావు. పైగా నా ఉద్యోగానికీ, మీ పనులకూ కుదరదు" అన్నాను మెల్లగా. నాకు ధైర్యం కలిగించేందు కేమో — నవ్వు ముఖం పెట్టుకొని "తొందరేమీ లేదులే. ఆలోచించుకొని రేపు చెప్పు" అన్నాడు. "సరే" నని వెంటనే వచ్చేసినాను — బరువైన హృదయంతో.

నావల్ల అతను ఏమి సహాయం కోరినాడనే ప్రశ్న నాకు పట్టలేదు. ఎందుకంటే — దేశంలో యెన్ని చట్టాలున్నాయో అన్ని చట్టాలనూ ధిక్కరించే వాళ్లు ఈ వూర్లో వున్నారు. అన్ని పూర్లలో వున్నట్లే ఈ వూరులోనూ అన్ని రకాల మనుషులూ వున్నారు. కేసులు పెట్టదలచుకుంటే రోజుకు యాభై కేసులు పెట్టవచ్చు — న్యూసెన్సు కేసు మొదలు ఖూనీ ప్రయత్నం వరకూ. నన్ను బాధించిన ప్రశ్న రామ్మూర్తి యీ విధంగా యెందుకు మారిపోయినాడా అని. అతనిమీద నాకున్న కొద్దిపాటి అభిమానంవల్ల ఆ ప్రశ్న బాధగా మారింది. ఆరోజే నన్ను యిద్దరు ముగ్గురు అడిగినారు — "కొత్త సబిన్‌స్పెక్టర్ చాలా దుర్మార్గుడంట — నిజమేనా ?" అని.

తరువాత మూడురోజులు రామ్మూర్తిని కలుసుకోలేదు. ఆ మూడు రోజుల్లో అతన్ని గురించి కొన్ని వార్తలు విన్నాను. అతను చాలా సమర్థుడనీ, డిపార్టుమెంటులో మంచి పేరుందనీ, దయాదాక్షిణ్యం లేని వాడనీ. ఈ వార్తలన్నీ జవాన్ల ద్వారా ప్రచారంలోకి వచ్చినవే. నిజమెంతో అబద్ధమెంతో తేల్చడం కష్టమనుకున్నాను.

నిన్న సాయంత్రం మా పొరుగింటామె యేడుస్తూ నా దగ్గరకు వచ్చింది, ఆమె భర్తను పోలీసులు నిష్కారణంగా పట్టుకున్నారని. ఏ తప్పూ చేయంది ఎందుకు పట్టుకుంటారని నేనెంత వాదించినా, ఆమె మాట ఆమెదే. ఆమెను గురించి రామ్మూర్తి దగ్గరకు పోదామనుకున్నాను. కానీ, మొగమెక్కక పోలేక పోయినాను. తరువాత గంట సేపటికి ఆమె భర్త కనపడి, తనమీద సారాయి కేసు రాసుకొని వదలిపెట్టినారని చెప్పినాడు. ఆశ్చర్యంతో అతన్ని అడిగినాను "నీ వెప్పుడూ సారాయి త్రాగవే?" అని. "యెందుకు త్రాగను? యిరవై యేండ్ల నాడొకసారి త్రాగింటి" నన్నాడు అతను. యిరవై యేండ్ల నాటికీ, యీ కేసుకూ యేమి సంబంధం?" అన్నాను మరింత ఆశ్చర్యంతో. "యేమో నాకేం తెలుసు? సబిన్స్పెక్టర్ నడగండి" అంటూ అతను దాటిపోయినాడు. ఆశ్చర్యం నుండి తేరుకొని చాలాసేపు ఆలోచించినాను రామ్మూర్తిని గురించి. అతనితో స్వయంగా మాట్లాడితేగాని నిజం తేలదని నిశ్చయించుకున్నానే గాని, పోవడానికి మనసొప్పలేదు,

రాత్రి తొమ్మిది గంటలప్పు డొక జవాన్ వచ్చి సబిన్స్పెక్టర్ రమ్మంటున్నాడని చెప్పినాడు. ఎందుకు రమ్మన్నాడో అని ఒక వైపు భయంగానే వున్నా, అనుమానాలైనా తీర్చుకోవచ్చునని అనుకున్నాను. రామ్మూర్తి యింట్లో వున్నాడని విని, స్వేచ్ఛగా మాట్లాడుకోవచ్చునని కొంత ధైర్యం కలిగింది. నేను పోగానే నన్ను పిలిపించిన పని

చెప్పినాడు. "మీ పొరుగింటి మల్లయ్యతో నీవు చెప్పితే సరిపోతుంది. కోర్టులో కేసు వొప్పుకునేటట్లు చేయాలి. ఒప్పుకోకపోతే నాకూ కష్టమే, అతనికీ కష్టమే." ఒక క్షణం నా గుండె నిలిచిపోయినంత పనైంది. చాలా సేపటికిగాని తేరుకొని మాట్లాడలేక పోయినాను. కడకు ధైర్యం చేసి "ఇంతకూ అతను సారాయి త్రాగలేదుగా!" అన్నాను. రామ్మూర్తి వింతగా నవ్వుతూ చెప్పినాడు: "అందరూ త్రాగినవాళ్లే దొరుకుతారా? కొందరు త్రాగినవాళ్లూ, కొందరు త్రాగనివాళ్లూ. మా పనిగూడా జరగాలి గదూ."

నాకే సిగ్గయింది. నేనే యేదో తప్పు చేసినట్లు మెల్లగా అన్నాను: "ఐతే న్యాయం, అన్యాయం యేమీ లేదా?" రామ్మూర్తి నవ్వుతూనే సమాధానం చెప్పినాడు: "న్యాయాన్యాయాలు చూసుకోడానికి దేవుడున్నాడులే. మన బాగోగులు మనం చూసుకుంటే చాలు."

ఇక రామ్మూర్తితో మాట్లాడి లాభం లేదనుకొని లేచి నిలబడినాను. వెంటనే అతను సీరియస్‌గా "మరి మల్లయ్య సంగతేమంటావ్?" అన్నాడు. మనసులోని బాధనంతా అణచుకొని, శాంతంగా అన్నాను: "మల్లయ్యతో నేనెందుకు చెప్పాలి?" రామ్మూర్తి మళ్ళీ నవ్వినాడు. ఆ నవ్వే నాకు దుర్భరంగా కనపడింది. నవ్వుతూ అతనన్నాడు: "నీ స్నేహితునిగా అడుగుతున్నాననుకో. లేకపోతే సబిన్‌స్పెక్టరుగానే అడుగుతున్నాననుకో. నేను మల్లయ్యకే గాదు — నీకూ సబిన్‌స్పెక్టర్నే గదూ."

కోపంతో వొళ్ళంతా మండిపోయింది నాకు. "మూడేండ్ల నాడు మనిషివి. ఈనాడు వట్టి సబిన్‌స్పెక్టర్‌వు." అంటూ గబగబా వచ్చేసినాను.

రాత్రంతా నాకు నిద్రపట్టలేదు – ఒకటే ఆలోచనతో – 'మనుషులు విధిలేక మారుతారా, లేక బుద్ధిపూర్వకంగా మారుతారా ?' అని.

(ఫిబ్రవరి 1958)

—)*(—